క్లుప్తంగా

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

ఆదోనిరూరల్ : రాహుల్‌గాంధీపై వేసిన పరువునష్టం కేసుపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ ఆదోని ఇన్‌చార్జ్ నీలకంఠప్ప పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ నాయకులు స్వీట్లు పంచుకుని హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ గుజరాత్‌లోని సూరత్‌కోర్టు ఇచ్చిన తీర్పును నిలిపివేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దిలీప్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతిరావు, కార్యదర్శి సాయినాథ్ పాల్గొన్నారు.

ఆటో వర్కర్లు నిబంధనలు పాటించాలి

ఆదోనిరూరల్ : ఆటో వర్కర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.ఎస్.గోపాల్, గోవింద్, శంకర్ సూచించారు. ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో వర్కర్లతో సమావేశం నిర్వహించారు. టూరిస్ట్ లాడ్జి, ఆటో స్టాండ్ వద్ద ట్రాఫిక్ సీఐ పార్థసారథి సూచనలు పాటించాలని చెప్పారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా ఆటో డ్రైవర్లందరూ కృషి చేయాలన్నారు. సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేపట్టే మహాపాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోనిఅర్బన్: పట్టణంలోని ఎంఐజీ, హెచ్ఐజీ, పోస్టల్ కాలనీ, త్రీటౌన్, తాలూకా పోలీస్ స్టేషన్, బీవీఆర్ కాలనీలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ డీ1 నాగభూషణం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా కాలనీల్లో మరమ్మతులున్నందున ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

శ్రమదానం

కోసిగి: మండల కేంద్రం నుంచి చింతకుంట, పల్లెపాడు మీదుగా మాలపల్లి వరకు ఆటో డ్రైవర్లు ఆదివారం గుంతలు పడిన చోట తాత్కాలికంగా మట్టి వేసి పూడ్చివేశారు. కోసిగి నుంచి పల్లెపాడు మీదుగా ఎమ్మిగనూరు పట్టణానికి వెళ్లే రోడ్డుపై ఆయా గ్రామాల వద్ద కంకర తేలి అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు మరింత పెద్దగా కావడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆటో డ్రైవర్లు శ్రమదానం చేసి గుంతలు పూడ్చారు.

న్యాయవాదులకు ఆటల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

ఆదోనిఅర్బన్ : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆదోని బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులకు ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో న్యాయవాదులు నాలుగు జట్లుగా ఏర్పడి క్రికెట్ ఆడారు. ఫైనల్ మ్యాచ్‌లో జీవన్‌సింగ్, వైఆర్ టీంలు తలపడగా వర్షంతో నిలిచిపోయింది. మహిళా న్యాయవాదులు త్రోబాల్, లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షురాలు అనితబాయి, కార్యదర్శి అంజినప్ప పాల్గొన్నారు.

పాఠశాలలకు విరాళం

కోసిగి: స్థానిక బాలిక, దుద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ఆదోనికి చెందిన ఆదర్శ మిత్ర మండలి అధ్యక్షుడు సతీష్ నివర్తి ఆధ్వర్యంలో సభ్యులు బోరు, మోటారు తదితర పరికరాలు విరాళంగా అందజేశారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో రూ.1.50లక్షలతో తాగునీటి బోరుకు 2హెచ్‌పీ మోటారు, పైప్‌లైన్, ట్యాపులు వేయించారు. అలాగే దుద్ది జిల్లా ఉన్నత పాఠశాలకు మైక్ సిస్టమ్ అందజేశారు. మండలి సభ్యులకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి కేశవయ్య, సభ్యులు శ్రీవాణి, రవిప్రకాష్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సునీల్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

కోసిగి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 2006–2007లో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు, స్నేహితులు ఆదివారం స్నేహితుల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ఆవరణలో నాటి తమ గురువు ప్రస్తుత ఇన్‌చార్జ్ హెచ్ఎం ఖలీల్ అహ్మద్ సమక్షంలో కేక్ కట్ చేసి పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు అనుమేష్, బసవ, ఓబులేష్, రాజు, వెంకటేష్, వీరాంజి, రాము, తరుణ్, ఈరన్న పాల్గొన్నారు.

అఘాయిత్యాలను అరికట్టాలి

ఆదోని సెంట్రల్: మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ప్రభుత్వాలు నియంత్రించలేకపోతున్నాయని సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ పేర్కొన్నారు. ఆదివారం కారంచేడు, చుండూరు, వేంపేట గ్రామాల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాప సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ దళితులు, మైనార్టీలు, ఆదివాసీలపై మతోన్మాద శక్తులు దాడులు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రసూల్, మహేశ్, సునిల్, పవన్ పాల్గొన్నారు.

చంద్రబాబుపై కేసు నమోదు చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్ : ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు తన పర్యటనలో పార్టీ కార్యకర్తలు, నాయకులను రెచ్చగొట్టి అల్లకల్లోలం సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి మండిపడ్డారు. పుంగనూరు ఘటనలో చంద్రబాబునాయుడిని ఏ1 నిందితుడిగా చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, తన అనుచరులను రెచ్చగొడుతూ అల్లర్లు సృష్టించేందుకే కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. పుంగనూరులో టీడీపీ సృష్టించిన విధ్వంసం పవన్ కల్యాణ్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పర్యటిస్తూ అసత్యాలు ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. కేవలం గొడవలు సృష్టించేందుకే పాదయాత్ర, బస్సుయాత్ర, ప్రాజెక్టుల యాత్రలు చేపట్టారని విమర్శించారు. దాడులను ప్రజలు ఎన్నటికీ క్షమించరని, ఇప్పటికైనా టీడీపీ తన కుతంత్రాలను కట్టిపెట్టి ప్రజలను క్షమాపణ కోరాలని సూచించారు. వైఎస్సార్‌సీపీకి ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక మూకుమ్మడిగా ఆరోపణలు చేస్తూ, విధ్వంసానికి కుట్రపన్నారన్నారు. ఇలాంటి తోడేళ్ల గుంపులను రాబోయే ఎన్నికల్లో ప్రజలు రాష్ట్రం నుంచి తరిమి కొట్టడం ఖాయమన్నారు. కౌన్సిలర్‌లు సురేష్, నగరూరు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, మల్లికార్జున, ఎస్సీ సెల్ నాయకులు పరిగల నారాయణ పాల్గొన్నారు.

రెచ్చగొట్టే బుద్ధి మానుకో..

- పుంగనూరు రగడకు చంద్రబాబే కారణం
- ఓటమి భయంతోనే అలజడులు
- ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి
- 167వ జాతీయ రహదారిపై వైఎస్సార్‌సీపీ రాస్తారోకో



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం : తన పాత బుద్ధి అయిన రెచ్చగొట్టే చర్యలను టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మానుకోవాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సూచించారు. ఇప్పటికే ప్రజలు మిమ్మల్ని మరిచిపోయారని, ఎలాగైనా మళ్లీ మీడియాలో కనిపించి, తన పేరును ప్రజలు గుర్తుకు తెచ్చుకోవాలనే కుట్రతో చిత్తూరు జిల్లా పుంగనూరు రగడకు ఆజ్యం పోశారని మండిపడ్డారు. పుంగనూరు ఘటనకు కారణమైన చంద్రబాబు తీరును నిరసిస్తూ ఆదివారం 167 జాతీయ రహదారిపై వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి రాస్తారోకో చేపట్టారు. పార్టీ సీనియర్ నేత వై.సీతారామిరెడ్డితో కలిసి ఆందోళనకు దిగారు. అరగంట పాటు చేపట్టిన ఆందోళనతో రహదారిపై రాకపోకలు స్తంభించాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతోనే చంద్రబాబు ఊరూరా అలజడులు సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఏనాడు ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసినా దాఖలాలు లేవన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సింగిల్‌గానే పోటీలో దిగి విజయఢంకా మోగించారని గుర్తు చేశారు. చంద్రబాబు రాజకీయమంతా అలజడల మయమేనని విమర్శించారు. కార్యకర్తలను రెచ్చగొట్టి వారిని బలిపశువులను చేస్తున్నారని, వారి కుటుంబాలకు తీరని నష్టం చేకూరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని కుట్రలు పన్నినా, అలజడులు సృష్టించినా ప్రజలు బాబును నమ్మే పరిస్థితి లేదన్నారు. రాబోయే ఎన్నికల్లోనూ తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన సాగిస్తున్నారని, జీర్ణించుకోలేక ఇలాంటి అల్లర్లకు ఆజ్యం పోస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ఆందోళనలో ఆ పార్టీ మండల కన్వీనర్ భీమిరెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచులు తెల్లబండ్ల భీమయ్య, ముక్కరన్న, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, కాంతరెడ్డి, గురరాజారావు, శంకర్, విఖ్యాతరెడ్డి, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పవమాన హోమం



ప్రత్యేక అలంకరణలో మంగరాయ ఆంజనేయస్వామి



పవమాన హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోనిఅర్బన్ : అధిక శ్రావణ మాసం సందర్భంగా మంగరాయ ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో పవమాన హోమం నిర్వహించారు. ఐదు రోజులపాటు జరిగిన శ్రీ మద్భాగవతం కార్యక్రమం ఆదివారం చేపట్టిన హోమంతో ముగిశాయి. మంత్రాలయం మఠం శ్రీ సుబుదేంద్రతీర్థ మహాస్వాముల ఆదేశాల మేరకు ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ముందుగా స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, తేనాభిషేకం, ప్రత్యేకంగా వెండి ఆభరణాలతో అలంకరణ, మహామంగళహారతి తదితర పూజలు చేపట్టారు. సరస్వత రత్న విద్వాన్ సుస్వరం నాగరాజ ఆచార్యులు శ్రీ మద్భాగవతం ప్రసంగించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



ప్రమాణ స్వీకారం చేస్తున్న రఘునాథ్‌రెడ్డి

రైతులకు విరివిగా రుణాలు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం : రైతులకు సహకార సంఘాల ఆధ్వర్యంలో విరివిగా రుణాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. కల్లుదేవకుంట సహకార సంఘం 7వ అధ్యక్షుడిగా కె. రఘునాథ్‌రెడ్డి ప్రమాణ స్వీకారం ఆదివారం అట్టహాసంగా సాగింది. ఆదివారం కల్లుదేవకుంట సొసైటీ ఎదుట జరిగిన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వై.సీతారామిరెడ్డితో పాటు ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సొసైటీ సీఈఓ బి.వెంకటేశ్వర్లు నేతృత్వంలో రైతుల సమక్షంలో రఘునాథ్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంఘం పరిధిలో 10 గ్రామాల రైతులు ఉన్నారని తెలిపారు. 1972లో సొసైటీ స్థాపించగా ప్రస్తుతం రూ. 20.71 కోట్ల లావాదేవీలతో కొనసాగుతోందన్నారు. సొసైటీ నుంచి 930 మందికి పంట రుణాలు, 99 మందికి డెయిరీ రుణాలు, రైతు నేస్తం కింద 170 మందికి, రాజన్న చేయూత కింద 51 మంది రైతులకు రుణాలు ఇచ్చినట్లు వివరించారు. రాబోయే రోజుల్లో సంఘం సేవలను మరింత విస్తృతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. రూ.40 కోట్ల వరకు లావాదేవీలు జరిగేలా లక్ష్యం పెట్టుకున్నామన్నారు. రైతులు రుణాలు చెల్లించి సంఘానికి సహకరించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ విశ్వనాథ్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, నాయకులు తెల్లబండ్ల భీమయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, గురురాజ స్వామి, వెంకటరెడ్డి, వీరారెడ్డి, ముక్కరన్న, కాంతరెడ్డి, ఆడిటర్ శంకర్, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్ రాజు, రైతులు పాల్గొన్నారు.

పార్కింగ్ కోసం ప్రత్యేక చర్యలు

- ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య



స్థలాలను పరిశీలిస్తున్న డీఎస్పీ సీతారామయ్య

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా దర్శనానికి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య తెలిపారు. ఆదివారం ఆయన కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డితో కలిసి ఉరకుంద దేవాలయ పరిసరాల్లో పర్యటించారు. దేవాలయం చుట్టూ ఆయా రూట్‌లలో ఉన్న పొలాల యజమానులతో మాట్లాడారు. ప్రధానంగా ఆదోని రూట్, కోసిగి, కౌతాళం రూట్‌లలో వాహనాలు అధికంగా వస్తాయని దీనికి అనుగుణంగా పార్కింగ్ స్థలం కేటాయించేందుకు చుట్టుపక్కలనున్న పొలాల యజమానులతో చర్చించారు. నెల రోజుల పాటు జరిగే ఉత్సవాలకు వేలాదిగా వాహనాలు వస్తాయని, దీనికి తగ్గట్టుగా పార్కింగ్ స్థలం కావాలని అందుకే పొలాల యజమానులు సహకరించాలని కోరారు. వాహనదారుల నుంచి నామినల్ ఫీజు వసూలు చేసేలా చూస్తామని పార్కింగ్ స్థలాల వద్ద పోలీసు బందబస్తు ఉంటుందని, అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈనెల 17నుంచి సెప్టెంబర్ 14 వరకు జరిగే ఈ ఉత్సవాలకు అందరూ సహకరించాలన్నారు. దాదాపు 20 లక్షల మంది భక్తులు రానున్నారని అంచనా వేస్తున్నామని, అందుకు తగ్గట్టుగా రెండు వందల మంది పోలీసులు, ఎన్‌సీసీ విద్యార్థులతో ప్రత్యేక బందబస్తు, కంట్రోల్ రూం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. రెండవ, మూడవ సోమవారాల్లో భక్తుల రద్దీ లక్షల్లో ఉంటుందని, ఆ రోజుల్లో బందోబస్తును కూడా పెంచుతామన్నారు. అలాగే ఆదోని, కౌతాళం, కోసిగి, హాల్వి నాల్గు రూట్‌లలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆలయ సిబ్బంది, పోలీసులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీఎస్‌పీఈ నాయకులు

ఆదోనిరూరల్ : కార్మిక చట్టాలను అమలు చేసి విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి సహకరించాలని ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీఎస్‌పీఈ) నాయకులు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని కోరారు. ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే స్వగృహంలో కలిసి వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ కార్మిక చట్టాల ప్రకారం కాంట్రాక్టు కార్మికులకు వేతనం చెల్లించాలని, విద్యుత్ సంస్థల్లో నియమించబడిన ఉద్యోగులకు జీపీఎఫ్, పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ.. సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

సెప్టెంబర్ 30 నుంచి శోభాయాత్ర

ఆదోనిఅర్బన్ : సెప్టెంబర్ 30వ తేదీ నుంచి శౌరీ శోభయాత్ర చేపడతామని విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ జిల్లా ఉపాధ్యక్షులు ధర్మగుణ, జిల్లా ఉపాధ్యక్షురాలు రాధారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు స్థాయిలో విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని బసాపురం రోడ్డులోని కళ్యాణ్ ఫ్యాక్టరీ ఆవరణలో ఆదివారం పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ విక్రమసింహ తెలిపారు. కొడల్‌పేటకు చెందిన చిలక రాఘవేంద్ర, సంతపేట కళ్యాణ్‌కుమార్, బైచిగేరికి చెందిన తెలుగు నరసప్ప, రంగారెడ్డి, హవన్నపేటకి చెందిన రంజాన్ రహంతుల్లా, బసాపురంకు చెందిన గంగన్న, ఖాజీపురంకు చెందిన రఫిక్, హనుమాన్‌నగర్‌కి చెందిన రవిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి పేకముక్కలు, రూ.34 వేలు నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది లక్ష్మణ్, భీమలా నాయక్, రంగస్వామి, రామచంద్ర, దయాకర్, ముస్తక్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

చిరుత దాడిలో గొర్రె మృతి



కోసిగి: మండల కేంద్రానికి చెందిన దుర్నిగేని రాజుకు చెందిన గొర్రెల మందపై శనివారం రాత్రి చిరుత దాడి చేసి ఒక గొర్రెను ఎత్తుకెళ్లిందని బాధితుడు తెలిపాడు. వివరాలు..కోసిగి సమీపంలోని మేదర గట్టు సమీప పొలాల్లో గొర్రెలను ఉదయం నుంచి సాయం కాలం వరకు మేపి అక్కడ ఒక పొలంలో నిలిపి ఉంచగా.. రాత్రి చిరుత దాడి చేసి ఒక గొర్రెను పట్టుకుని కొండల్లోకి తీసుకెళ్లిందన్నారు. ఉదయం ఒక గొర్రె కనిపించక పోవడంతో కొండలోకి వెళ్లి చూడగా.. గొర్రె మృతి చెందిందని చెప్పారు. సంబంధిత అధికారులు చిరుతలను తరలించి తమకు రక్షణ కల్పించాలని బాధితులు కోరారు.

కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలి



ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థినికి స్వీటు తినిపిస్తున్న ఎమ్మెల్యే

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నతస్థితికి చేరుకోవాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సూచించారు. ఆదివారం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన ప్రతీక, ప్రీతిని తన స్వగృహంలో అభినందించారు. ఆయన వసతి దీవెన, విద్యాదీవెన, విదేశీ విద్యాదీవెన, అమ్మ ఒడి వంటి పథకాలతో పేద విద్యార్థులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు. తల్లిదండ్రుల కష్టాలను గుర్తెరిగి చదువుకొని భవిష్యత్‌లో స్థిరపడాలని ఆకాంక్షించారు.

ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

కౌతాళం: బదినేహాల్ పంచాయితీ ఉప ఎన్నికకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిందని ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని బదినేహాల్ పంచాయతీ సర్పంచ్ రామప్ప అక్టోబరులో మృతి చెందడంతో ఇక్కడ ఉప ఎన్నిక జరగనున్నది. ఈనెల 8నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ ప్రక్రియ ఉంటుందని, ఈనెల 19న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బదినేహాల్ సర్పంచ్ ఎన్నికతో పాటు మండలంలోని ఖాళీగా ఉన్న వార్డు సభ్యుల ఎన్నిక కూడా నిర్వహిస్తామన్నారు. కౌతాళంలోని 12వ వార్డుకు, గోతులదొడ్డిలోని 8వ వార్డు, కుంబళనూరులోని 3వ వార్డు, రౌడూరులోని 6వ వార్డుకు ఉప ఎన్నికలు ఉంటాయని వివరించారు. 19న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్, 2 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

పేద కుటుంబానికి సాయం



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న దంపతులు

ఆదోనిటౌన్ : పట్టణంలోని 35వ వార్డు పాత ఓవర్ బ్రిడ్జి బి.ఎస్.లాడ్జి సమీపంలో నివాసముంటున్న నిరుపేద దంపతులు తాయమ్మ, చిన్నరంగన్న గుడిసెలో నివసిస్తున్నారు. అయితే వర్షం వస్తే గుడిసె మొత్తం వెలిసిపోయి తడిచిపోయేది. శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారి గుడిసెను ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి సందర్శించారు. లోపలికి వెళ్లి చూసి రంధ్రాలు పడిన రేకులను చూసి ఇలా ఉంటున్నారని ప్రశ్నించారు. దీంతో వారు తమ దీనస్థితిని వివరించడంతో చలించిన ఎమ్మెల్యే సాయం చేస్తానని చెప్పారు. ఈ మేరకు ఆదివారం పాత రేకులను తొలగించి కొత్త రేకుల షెడ్‌ను ఏర్పాటు చేయించారు. ఇందుకు రూ.25వేల వరకు ఖర్చయ్యింది. దీంతో ఆ పేద దంపతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. షెడ్ నిర్మాణం పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు రవి, పీరా, లక్ష్మన్న పూర్తి చేయించారు.

పల్లె.. పొలం బాట



కందుకూరులో సూర్యోదయాన పొలం బాట పట్టిన కుటుంబ సభ్యులు ,



జీవాలను మేతకు తీసుకెళ్తున్న పోషకుడు



కడదొడ్డిలో గోధూళి వేళ ఇంటి బాట పట్టిన గోవులు

మంత్రాలయం: వరుణుడు పలకరిస్తున్న వేళ.. పల్లె పొలం బాట పట్టింది. మూగబోయన హలాలు సవ్వడి చేస్తున్నాయి. వెలవెలబోయిన పొలాలు కూలీలతో సందడిగా మారాయి. పచ్చని బయళ్ల వైపు మూగజీవాలు పరుగులు పెడుతున్నాయి. సంధ్య, సాయంకాల వేళల్లో పల్లె అందాలు ఉట్టిపడుతున్నాయి. పశువులు, జీవాల ధూళితో దారులు కనువిందు చేస్తున్నాయి. వాన రాకతో వాడిన పైర్లు జీవం పోసుకున్నాయి. నియోజకవర్గంలో ఇటీవల వర్షాలు కురవడంతో ఇప్పుడిప్పుడే వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి.



మల్లన్న హట్టి వద్ద కలుపు నివారణకు దెంత పడుతున్న రైతులు



కరిణి పొలాల్లో ఎరువు సిద్ధం చేసుకుంటున్న రైతు



కరిణి వద్ద పచ్చగా ఉల్లి పైరు

జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం



ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న నూతన యూత్ కమిటీ నాయకులు

ఆదోనిరూరల్ : రాబోయే ఎన్నికల్లో సైనికుల్లా పనిచేసి జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుందామని, ఆ బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కొత్తగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ యూత్ కమిటీ మండల అధ్యక్షుడు పెద్దహరివాణం చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ యూత్ మండల కమిటీ సైనికుల్లా పనిచేయాలని సూచించారు. మీకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత తనదన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. శాంతియుతంగా పార్టీ కోసం పని చేయాలని చెప్పారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. యూత్ సంఘం నాయకులు నల్లారెడ్డి, మధు, రాముడు, పరమేష్, సోము, హుల్తెప్ప, సురేష్, సద్దాం, ఉరుకుంద, నాగరాజ్ పాల్గొన్నారు.